

జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ పుంగనూరులో అరాచకమే రాజ్యమేలింది. రాష్ట్రంలో అధికారం మారినాక అయినా పరిస్థితులు చల్లబడతాయని ప్రజలు ఆశపడ్డారు. తమకు న్యాయం జరుగుతుందని వైసీపీ బాధితులైన టీడీపీ కార్యకర్తలు నమ్మారు. కానీ ఏం మారలేదని శనివారం పట్టపగలు జరిగిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య సంఘటన నిరూపిస్తోంది.టీడీపీకి నమ్మకమైన కార్యకర్తను వైసీపీ నాయకుడు నరికి చంపిన తీరు అందరినీ భయపెడుతోంది. పోలీసులు, ఇతర శాఖల అధికారులూ కూడా ఇప్పటికీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తున్నారనే ఆరోపణలకు ఈ సంఘటన బలం చేకూరుస్తోంది. వైసీపీ నుంచి తనకు ప్రాణహాని ఉందని పదేపదే వేడుకున్నా రామకృష్ణ ప్రాణాలను కాపాడలేకపోయారు. వెంకట్రమణ అనే వైసీపీ కార్యకర్త చేతిలో దారుణంగా టీడీపీ కార్యకర్త హత్యకు గురయ్యాడు. ఈ పరిణామంతో జిల్లాలో వైసీపీ గత అరాచకాల గురించీ.. కొత్త ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న నిర్లక్ష్యం గురించీ చర్చ జరుగుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఆగని వైసీపీ అరాచకాలు

● ప్రభుత్వం మారినా పుంగనూరులో టీడీపీ నేతలే బాధితులు

ప్రాణహాని ఉందని పోలీసులను వేడుకున్నా...

● వైరల్ అయిన రామకృష్ణ వీడియో



రామకృష్ణ మృతదేహం

విలపిస్తున్న మృతుడి భార్య దేవమ్మ

కృష్ణాపురంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, మృతుడి కోడలు భార్గవి ఆగ్రహం



రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) :తొలినుంచీ టీడీపీని వీడకుండా దాడులు, కేసులు భరిస్తూ వచ్చిన రామకృష్ణ చివరకు వైసీపీ కార్యకర్త చేతిలో హతమారిపోవాల్సి వచ్చింది. పుంగనూరు నియోజకవర్గంలో చాలామంది ముఖ్య నాయకులు టీడీపీని వీడినా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన కాగతి రెడ్డెప్ప కుమారుడు రామకృష్ణ(55) కుటుంబం మాత్రం పార్టీ పట్ల అంకితభావంతో కొనసాగింది. కృష్ణాపురంలో వైసీపీ కార్యకర్తగా పెద్దిరెడ్డి వెంట ఉన్న కె.శ్రీరాములు కుమారుడు కాగతి వెంకటరమణ(45) గ్రామంలో టీడీపీని లేకుండా చేయాలని రామకృష్ణ కుటుంబంతో తరచూ గొడవకు దిగుతుండడంతో వీరి మధ్య రాజకీయ కక్షలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ప్రభుత్వ భూములను వైసీపీ పాలనలో ఆక్రమించి వ్యవసాయ పొలాలుగా మార్చినట్లు అధికారులకు, టీడీపీ నాయకులకు రామకృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో రామకృష్ణపై వెంకటరమణ కక్ష అధికమైంది.గత నెల 10వ తేదీన రామకృష్ణ పొలానికి మట్టిని తరలిస్తుండగా వెంకటరమణ స్థలంలో టిప్పర్ వెళ్లిందని ఇరువర్గాలు ఘర్షణపడి పుంగనూరు వైద్యశాలలో చేరడంతో సీఐ శ్రీనివాసులు 17వ తేది ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. తర్వాత మళ్లీ రామకృష్ణ, ఆయన కుమారుడు శివ, కోడలు భార్గవిపై వెంకట్రమణ వర్గీయులు దాడి చేశారు. అలాగే 15 రోజుల క్రితం రామకృష్ణ పెద్దకుమారుడు శివపై వెంకటరమణ దాడి చేసి చెయ్యి విరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఫిర్యాదు తీసుకోకుండా రామకృష్ణపై మండిపడి, తమపై దాడులు చేసిన వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కొద్దిసేపటికే విడిచిపెట్టి తమకు అన్యాయం చేస్తున్నట్లు రామకృష్ణ ఒక వీడియో విడుదల చేశారు. రాజకీయకక్షలు శృతి మించిన నేపథ్యంలో వెంకటరమణ శనివారం ఉదయం వేటకొడవలితో రామకృష్ణ కుమారుడు సురేష్‌పై దాడికి ప్రయత్నించాడు.గాయపడ్డ సురేష్ తప్పించుకున్నాడు. అదే సమయానికి రామకృష్ణ ట్రాక్టర్‌తో పొలం దున్ని ఇంటికి రాగా వెంకటరమణ అతడి చేరుకుని రామకృష్ణ కాలు, తొడపై కొడవలితో నరకడంతో రామకృష్ణ రోడ్డుపై పడిపోయాడు. మెడపై నరికి వ్యవసాయ పొలాల్లోకి వెంకటరమణ పరుగులు తీయడాన్ని గ్రామస్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.గాయపడిన రామకృష్ణను చికిత్స నిమిత్తం మదనపల్లెకు అక్కడినుంచి తిరుపతికి తరలిస్తుండగా మృతి చెందాడు.

వెయ్యిమందిపై అక్రమ కేసులు

2023 ఆగస్టులో అంగళ్ల వద్ద చంద్రబాబును అడ్డుకున్న ఘటనలో ఏకంగా వందలమందిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించారు. భార్యా పిల్లల్ని వదిలేసి జైళ్లలో మగ్గారు. కేసుల భయంతో చాలామంది ఊర్లొదిలి వెళ్లిపోయారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై అధినేత రామచంద్ర యాదవ్ పర్యటనలను అడ్డుకోవడం, దాడులు చేయడం అప్పట్లో పరిపాటిగా మారింది. ఇలా పుంగనూరులో గత ఐదేళ్ల పాటు సుమారు వెయ్యిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం కేసులు పెట్టడంతో పాటు రౌడీషీట్లను నమోదు చేశారు.

సీఎం చెప్పినా..

చంద్రబాబు సీఎం అయ్యాక జనవరి 7న రెండోసారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం పర్యటించారు. పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారని, రౌడీషీట్లను తెరిచారని.. అవన్నీ అక్రమమేనని.. వాటన్నింటినీ ఎత్తేయాలని ద్రావిడ వర్సిటీలోని ఆడిటోరియంలో ఎస్పీ మణికంఠకు చెప్పారు.అయినప్పటికీ ఇంతవరకు ఆయా కేసుల గురించి సమీక్షించలేదు. ఎత్తేయలేదు.

పోలీసులు అదే స్థానాల్లో..

సాధారణంగా ప్రభుత్వాలు మారిన తర్వాత అధికారుల బదిలీలు కూడా జరుగుతాయి. అవసరాన్ని బట్టి ఆయా జిల్లాల్లో కూడా క్షేత్రస్థాయి అధికారుల బదిలీలు కూడా జరుగుతుంటాయి. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో జిల్లాలో అరాచకాలు చేసిన పోలీసులు ఇంకా అదే స్థానాల్లో కొనసాగుతుండడం ఆశ్చర్యకరం. వారికి స్థానిక వైసీపీ నాయకులతో సఖ్యత ఉంది. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తన నియోజకవర్గంలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లను మండలాలు మార్చాలని, వైసీపీ హయాం నుంచీ అక్కడే ఉండడంతో ఇబ్బందిగా ఉందని ఎస్పీ మణికంఠకు నాలుగు నెలల కిందట విన్నవించినా స్పందన లేదు.

ఎస్పీ తీరువల్లే ప్రాణాలు పోయే పరిస్థితి



జిల్లాలో ఎస్పీ తీరు సరిగా లేకే మా నాయకుల్ని బెదిరించే స్థాయి నుంచి ప్రాణాలు తీసే పరిస్థితి వచ్చింది.సీఐని కాదు.. ఉన్నతాధికారుల్ని సస్పెండ్ చేయాలి. మా పలమనేరు నియోజకవర్గంలో కూడా ఇంకా వైసీపీతో అంటకాగిన పోలీసులు పనిచేస్తున్నారు. పక్క పక్క మండలాలకు బదిలీ చేయమని ఎస్పీకి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో ఎస్పీకి ఫోన్ చేయడమే మానేశాను. మా నాయకుల్ని, కార్యకర్తల్ని చంపేస్తుంటే చూస్తూ ఇంట్లో కూర్చోమని మా సీఎం చెప్పలేదు కదా.?

- మదనపల్లె ఆస్పత్రి వద్ద అమరనాథ రెడ్డి

వైసీపీ అధికారంలో ఉన్నప్పటి అరాచకాల్లో కొన్ని..

● అప్పటి సీఎం జగన్ నియోజకవర్గమైన పులివెందులలో కూడా సజావుగా సాగిన శ్రీకాకుళంవాసుల సైకిల్‌యాత్ర పుంగనూరులో సాగలేదు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తల్ని పుంగనూరులో బట్టలూడదీసి ఘోరంగా అవమానించారు.

● పుంగనూరులో టీడీపీ కార్యాలయానికి అద్దెకిచ్చిన భవన యజమానిని వైసీపీ నాయకులు బెదిరించి, మున్సిపల్ అధికారులతో నోటీసులిప్పించి నిబంధనల పేరుతో భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తామన్నారు. దీంతో యజమాని కార్యాలయంలోని సామాన్లను బయట పెట్టించేశారు.

● సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం చేపట్టాలని చల్లా రామచంద్రారెడ్డి టీడీపీ శ్రేణులతో వస్తుండగా.. వైసీపీ శ్రేణులు అడ్డుకుని ఆయన కారుతో పాటు మరికొన్ని వాహనాలను ధ్వంసం చేశారు.

● పెద్దిరెడ్డికి కంటిలో నలుసుగా తయారయ్యారని పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటిని, ఆరు వాహనాలను, ఆస్తులను వైసీపీ మూకలు ధ్వంసం చేశాయి.

● మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెకు రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారానికి వచ్చారని వైసీపీ మూకలు రాళ్లు, కర్రలతో 17 వాహనాలు ధ్వంసం చేసి, ఐదు వాహనాలు దగ్ధం చేసి 20 మందిని గాయపరిచాయి. రామచంద్రయాదవ్ పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే వైసీపీ శ్రేణులు హతమార్చేందుకు చొచ్చుకుని రావడంతో పాటు ప్రచార రథాన్ని పోలీసుల ముందే కాల్చేశారు..

సీఎం ఆరా

రామకృష్ణ హత్యా ఘటనపై శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, అనిత, రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జరిగిన విషయాలను తెలియజేసి ఆస్పత్రిలో బాధితులను పరామర్శించి న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు బాధితులను ఓదార్చాలని హైకమాండ్ ఆదేశించింది.రామకృష్ణ కుటుంబసభ్యులను హోంమంత్రి అనిత ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు.కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

పుంగనూరు సీఐ సస్పెన్షన్




సీఐ శ్రీనివాసులు

పుంగనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త కె.రామకృష్ణను కిరాతకంగా హత్య చేసిన సంఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని పుంగనూరు సీఐ జి.శ్రీనివాసులును ప్రభుత్వం శనివారం సస్పెండ్ చేసింది. సీఐ శ్రీనివాసులుతో బాటు పుంగనూరు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యాన్ని కూడా సస్పెండ్ చేస్తూ విచారణకు ఆదేశించారు.అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ద్వారా హోంమంత్రి అనిత వివరాలు తెలుసుకుని వారిపై చర్యలకు ఆదేశించారు. టీడీపీ కార్యకర్త రామకృష్ణ 15 రోజుల క్రితం విడుదల చేసిన వీడియో శనివారం వైరల్ అయింది. అందులో పుంగనూరు సీఐ, పోలీసులు తమకు న్యాయం చేయలేదని, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, వైసీపీ వారినుంచి ప్రాణహాని ఉన్నట్లు పేర్కొనడం సంచలనంగా మారింది. దీనికి తోడు మృతుడి కుటుంబ సభ్యుల ఆరోపణలు, ప్రభుత్వ పెద్దల ఆరాతో సీఐతో పాటు హెడ్‌కానిస్టేబుల్‌పై వేటు పడింది.

జిల్లాను తాకిన ఎండ సెగ

● సూళ్లూరుపేటలో అత్యధిక ఉష్ణోగ్రత
● ఆరు మండలాల్లో 38 - 39.5 డిగ్రీల నమోదు



తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎండాకాలం మొదలయ్యాక తొలిసారి వేసవి సెగ జిల్లాను తాకింది. శనివారం సూళ్లూరుపేటలో అత్యధికంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమి మరింత పెరగడానికి వచ్చే నెల దాకా వేచి చూడాల్సిన పనిలేదని తాజాగా నమోదైన ఉష్ణోగ్రత చెబుతోంది. జిల్లాలో ఫిబ్రవరి మూడవ వారం నుంచే ఉష్ణోగ్రతలో మార్పు కనిపించింది. ఈనెల మొదటి వారం నుంచి వేసవి ప్రభావం అనుభవంలోకి వచ్చింది. అయినప్పటికీ అత్యధిక ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల మధ్యే ఉంటోంది. అరుదుగా అక్కడక్కడా 38 డిగ్రీలు దాటి నమోదైంది. అయితే శనివారం తొలిసారిగా జిల్లాలో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటి 40 డిగ్రీలకు చేరువయ్యాయి. చంద్రగిరిలో 38.1, చిన్నగొట్టిగల్లులో 38.3, రేణిగుంట, చిల్లకూరు మండలాల్లో 38.6 డిగ్రీలు నమోదు కాగా పిచ్చాటూరులో 39, సూళ్లూరుపేటలో ఏకంగా 39.5 డిగ్రీలు చొప్పున నమోదయ్యాయి. దీంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇంచుమించు 40 డిగ్రీలకు చేరినట్టవుతోంది. సాధారణంగా ఏప్రిల్‌లో గానీ ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటదు. అలాంటిది మార్చి 15వ తేదీకే దరిదాపు 40 డిగ్రీలకు చేరువ కావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాది వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాడ్పుల తీవ్రత సైతం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే. చంద్రగిరి, ఎర్రావారిపాలెం, పాకాల, చిన్నగొట్టిగల్లు, రామచంద్రాపురం వంటి ఐదు మండలాల్లో జిల్లాలోని మిగిలిన మండలాలతో పోలిస్తే కాస్తంత తక్కువ ఎండ వేడిమి ఉంటుంది. తిరుపతి నుంచి తూర్పునకు వెళ్లేకొద్దీ వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటుందన్నది సాధారణమే అయినా ఈ పర్యాయం ముందస్తుగానే ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం జిల్లా ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తాజా ఉష్ణోగ్రతలు నొక్కి చెబుతున్నాయి. జిల్లా, డివిజన్, మండల, పంచాయతీ కేంద్రాలన్నింటిలో ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, వాటి దగ్గర చల్లటి నీటితో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటివి అందుబాటులో పెట్టాల్సి ఉంది. అలాగే వేసవి తాపానికి గురికాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ప్రచారం చేయడం వంటివి చేపట్టాల్సి ఉంది. మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టే కూలీల విషయంలో కూడా వేసవికి అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

తిరుపతి(విద్య), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ జనరల్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. 15 రోజులపాటు సాగిన ఈ పరీక్షలు ఎక్కడా మాల్‌ప్రాక్టీస్‌కు చోటు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. 13వ తేదీ ప్రథమ సంవత్సర పరీక్షలు ముగియగా శనివారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు చివరి పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 28,687 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 28,111 మంది రాశారు. 576 మంది గైర్హాజరయ్యారు. చివరి పరీక్ష రాసిన తర్వాత కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ కనిపించారు. బస్సుల్లో వెళుతూ టాటాలు చెబుతూ.. పేపరు ముక్కలు బయటకు విసురుతూ సంతోషపరవశులయ్యారు. కాగా ఒకేషనల్, బ్రిడ్జి కోర్సు విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

● సీసీ కెమెరాల నిఘాలో 164 కేంద్రాల్లో నిర్వహణ ● 4 సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగనున్నాయి. 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. తిరుమల ఎస్వీ హైస్కూల్, బాలాయపల్లి మండలం జయంపు జడ్పీ హైస్కూల్, చిట్టమూరు మండలం టీఎంఆర్ కొత్తగుంట జడ్పీహెచ్ఎస్, ఓజిలి మండలం చిల్లమానుచేను జడ్పీ హైస్కూల్ పాఠశాలలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలను అమర్చారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. 1,476 మంది ఇన్విజిలేటర్లతోపాటు 6ఫ్లయింగ్, 30 సిట్టింగ్ స్క్వాడ్లు, 164 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 164 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 40 మంది కస్టోడియన్లు, 10 మంది రూట్ ఆఫీసర్లు, 10మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు డీఈఓ కేవీఎస్ కుమార్ వెల్లడించారు. విద్యార్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను చూసుకోవాలని, పరీక్షకు గంట ముందు హాజరుకావాలని సూచించారు.

పది పరీక్షా కేంద్రాల పాఠశాలల్లో మధ్యాహ్న తరగతులు

వేసవి ప్రారంభం కావడం, ఎండలు మండిపోతుండటంతో జిల్లాలో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. అయితే పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం పూట తరగతులు నిర్వహించనున్నట్లు డీఈవో కేవీఎస్ కుమార్ వెల్లడించారు. మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి నేపథ్యంలో ఆయా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గ్రామ పంచాయతీ సహకారంతో తాగునీరు, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు కూడా విద్యార్థులకు ఎండదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అందరం కలిస్తేనే.. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సాధ్యం

● ఆకట్టుకున్న ప్లాస్టిక్ నియంత్రణ ర్యాలీ

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ప్రత్యేకాధికారి కోన శశిధర్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ కమిషనర్, జిల్లా ఇన్చార్జి స్పెషల్ అధికారి కోన శశిధర్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య జెండా ఊపి ప్లాస్టిక్ నియంత్రణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. తారకరామ స్టేడియం నుంచి టౌన్ క్లబ్ కూడలి వరకు ర్యాలీ సాగింది, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించాల్సిన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కోన శశిధర్ మాట్లాడుతూ శుభ్రతపై ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలన్నారు. పారిశుధ్యం, స్వచ్ఛత, అవినీతి నిర్మూలనలో అధికారులు, ప్రజలు భాగస్వామ్యంగా ఉండాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ శుభ్రత మీద ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలనేది స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్లాస్టిక్‌ని ప్రతి ఇంటి, పరిసరాలలో వాడకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం కృషి చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయని, వేరుచేసి వారికి ఇవ్వాలని చెప్పారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగించకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరి చేత స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించి, గుడ్డ బ్యాగులను ఆవిష్కరించారు. అనంతరం న్యూబాలాజీ కాలనీలో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఉమా, రిజిస్ట్రార్ రజిని, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



→ టౌన్‌క్లబ్ కూడలి వద్ద ర్యాలీ, మానవహారం

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం

చంద్రగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ పూర్తయ్యాక ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. మాడ వీధుల్లో స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్ కుమార్, రమేష్‌కుమార్, పాల్గొన్నారు.

తిరుమలలో పరిశుభ్రతపై అవగాహన



పరిశ్రుభతపై సూచనలు చేస్తున్న అధికారులు

తిరుమల, మార్చి15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్‌లో శనివారం సచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. టీటీడీ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో దుకాణదారులు పరిశ్రుభత కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా టీటీడీ హెల్త్ విభాగం అధికారులు దుకాణాల ముందు పరిశ్రభతకు పాటించాల్సిన నియమాలను వివరించారు. దుకాణాల పరిసర ప్రాంతాలను ఉన్న వ్యర్థాలను తొలగించారు.

'భవిత' కేంద్రాల్లో దివ్యాంగులకు భవిష్యత్తు



సహిత విద్యాబోధనను పరిశీలిస్తున్న చంద్రశేఖర రెడ్డి

భాకరాపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): 'భవిత' కేంద్రాలు దివ్యాంగులకు భవిష్యత్తును చూపుతాయని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య కో-ఆర్డినేటర్ చంద్రశేఖర రెడ్డి అన్నారు. భాకరాపేటలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్ష వారిచే ఇంటి వద్దనే విద్యను అందించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం భవిత కేంద్రాలకు రాలేని పిల్లలకు సహిత విద్యాబోధకులతో ఇంటి వద్దనే విద్య అందిస్తామన్నారు. ఫిజియోథెరపీతోపాటు స్పీచ్ థెరపీపై శిక్షణ ఇస్తారన్నారు. పిల్లలకు అలవెన్సు పరికరాలు, ఆపరేషన్లు వంటివి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు వెంకటరమణ, రమణయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం: నాని



క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. అవిలాల పంచాయతీలో గ్రామ సర్పంచ్ చెందిలి వెంకటరమణ అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ. పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రతికాలనీలో సచివాలయ ఉద్యోగితో పాటు స్థానిక నేతలు ముగ్గురు కలసి రోజూ పరిశుభ్రతను పర్యవేక్షించాలన్నారు. అంతకు ముందు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. క్లాత్ బ్యాగులను పంపిణీచేశారు. డీపీవో సుశీలదేవి, ఎంపీడీవో రామచంద్ర, వివిధశాఖల అధికారులు, కార్యదర్శి శ్రీలత, నేతలు ఈశ్వర్‌రెడ్డి, మధు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుభాషిణి, శివప్రసాద్‌రాయల్, గోపాల్, కురకాల్వ సుధాకర్, మునిరాయల్, తదితరులు పాల్గొన్నారు. పెరుమాళ్లపల్లెలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహనా కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు.

మురుగునీటితో ప్రజల అవస్థలు



ఖాళీజాగాలో మురుగునీరు

తిరుపతి రూరల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీ వీఐపీమార్గంలో అపోలో ఫార్మసీ సమీపంలోని ఖాళీ జాగాలో పంచాయతీ మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. యూడీఎస్ సదుపాయం లేకపోవడం వల్ల పలు అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరుతో పాటు వ్యర్థాలు ఈ ఖాళీస్థలంలోకి చేరుతున్నాయి. చెరువును తలపిస్తున్నాయి. మురుగు రోడ్డుకు దగ్గరగా చేరి పొంగుతోంది. సమీప వాసులు దుర్వాసనభరించలేక అవస్థలు పడుతున్నారు. దోమలతో అనారోగ్యంబారిన పడుతున్నామని వీరు వాపోతున్నారు. పలు గ్రామాలకు ఇదే ప్రధానమార్గం.

న్యాయం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తాం



తిరుపతిరూరల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారమూ కొనసాగింది. దీనిలో భాగంగా వర్సిటీ ప్రధానగేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

సమైక్యంగా ప్రజల పక్షాన పోరాటం

పాకాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం శనివారం వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేద్దామన్నారు. మండల వైసీపీ అధ్యక్షుడిగా నియమితులైన నంగా నరేష్ రెడ్డిని సన్మానించారు.

26నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 26నుంచి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు (స్టూడెంట్‌కప్ సీజన్ 2) జరగనున్నాయి. ఈ మేరకు శనివారం ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు శివకుమార్, సుమన్ శనివారం గోడపత్రికలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉద్యమాలు, నిరసనలకు పరిమితం కాకుండా విద్యార్థుల వికాసం కోసం నిరంతరం ఏదో ఒక కార్యక్రమంతో ముందుకెళ్తున్నారని అభినందించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రతి నగరంలో ఖేలో భారత్ పేరుతో వివిధ క్రీడలు నిర్వహించి విద్యార్థుల్లో మానసిక దృఢత్వం నింపడం కోసం కృషి చేస్తోందన్నారు. ఈ పోటీలలో మొదటిస్థానం కైవసం చేసుకొన్న జట్టుకు రూ.10వేలు, ద్వితీయస్థానం జట్టుకు రూ.6వేలు, తృతీయస్థానం జట్టుకు రూ.4వేలు బహుమతిగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 70950 06390, 95811 42220 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు రాఘవేంద్ర, సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పొంగుతున్నా పట్టించుకోరా !



తిరుపతి అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశంపార్కు వెనుక గోవిందరాజనగర్‌లో గత వారంలో రోజులుగా అండర్ డ్రైనేజీ పొంగుతోంది. మ్యాన్‌హోల్ నుంచి దాదాపు 200మీటర్ల పొడవున వీధిలో మురుగు ప్రవహిస్తుండటంతో దుర్గంధం వెలజల్లుతోంది. ఈగలు, దోమలతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. నగరపాలక సంస్థలోని సంబంధిత విభాగానికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎంపీడీవోగా వెంకటరత్నం బాధ్యతల స్వీకరణ

చంద్రగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఈవోపీఆర్డీ వెంకటరత్నం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవో కార్యాలయ ఏవో శేఖర్ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. తాజాగా ఈవోపీఆర్డీ ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీసీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం వెంకటరత్నానికి ఏవో శేఖర్ బాధ్యతలు అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన మహేష్

చంద్రగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముకుందవీధికి చెందిన నారశెట్టి మహేష్(27) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు చిల్లకూరు మండలం పెనుమూడికి చెందిన మహేష్ తిరుమలలోని ఓదుకాణంలో పని చేస్తున్నాడు. ఇతనికి వివాహమై ఆరేళ్లయింది. చంద్రగిరి ముకుందవీధిలో కాపురం ఉంటున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం తిరుమల నుంచి ఇంటికి వచ్చాడు. భార్య చిత్తూరుకు వెళ్లడంతో ఒంటి గంట సమయంలో ఇతడు ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు గమనించి సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి



మృతి చెందిన దావీదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆటోనగర్‌లో భవనంపై నుంచి పడి ఓ పెయింటర్ మృతి చెందాడు. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. గుంటూరుకు చెందిన దావీదు(56) తిరుపతికి వలస వచ్చాడు. ఈ క్రమంలో శనివారం భవనానికి పెయింట్ వేస్తుండగా కాలు జారి కింద పడ్డాడు. తలపై బలమైన గాయాలయ్యాయి. రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేశారు.

శ్రీవారి సేవలో మంత్రి టీజీ భరత్



తిరుమల/తిరుచానూరు, మార్చి15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి టీజీ భరత్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. మంత్రి టీజీ భరత్ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని నారద పుష్కరణికి పడమర వైపున ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సిబ్బంది అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది. షాపింగ్‌మాల్‌లోని నాలుగవ అంతస్తులో ఉన్న వంటగదితో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ప్రమాదం సంభవించింది. సిబ్బంది హుటాహుటినా మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సహా అక్కడికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. ఎలాంటి నష్టం వాటిల్లలేదని ధ్రువీకరించారు

సమన్వయంతో త్వరితగతిన అభివృద్ధి పనులు

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



దామలచెరువులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు,ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

పాకాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో పూర్తయిన పలు అభివృద్ధి పనులకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు,ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ప్రారంభోత్సవం చేశారు. రూ.1.2 కోట్ల వ్యయంతో నిర్మించిన దామలచెరువు-మొగరాల సీసీ రోడ్డు, రూ.2.8 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన నేంద్రగుంట - దామలచెరువు బీటీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా దామలచెరువులో జరిగిన సభలో ఎమ్మెల్యే ఎంపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. దామలచెరువు మ్యాంగోనగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, పల్ప్ ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేలా కృషి చేస్తామన్నారు. మ్యాంగో బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి సుబ్రమణ్యస్వామివారి ఆలయం వద్ద అభివృద్ధి పనులను పరిశీలించారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కార్యదర్శి పల్గుణ, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ, ఎంపీడీవో అరుణ, ఎమ్మార్వో సంతోష్ సాయి, పీఆర్‌డీఈ మురళిధర్ స్థానికులు మదునాయుడు, ఎల్. కోటి, చిన్నబ్బనాయుడు, చలపతినాయుడు, రఘునాథనాయుడు, కుమారస్వామినాయుడు, పురుషోత్తం నాయుడు, పాల్గొన్నారు.

ఊరూవాడా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమాలు



కల్యాణ వెంకటేశ్వరుడి ఆలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్నఅధికారులు,సిబ్బంది

చంద్రగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ అధికారులు, సిబ్బంది, చంద్రగిరి పోలీసులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దివస్ నిర్వహించారు. ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాల గురించి భక్తులకు వివరించారు. **పాకాల:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థులు కళాశాల పరిసరాల్లో వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డాక్టర్ రమేష్ కుమార్ ఎన్ఎస్ఎస్ పీవో మాశిలామణి, ఎన్‌సీసీ అధికారి ఈశ్వర బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దారు జనార్దన్‌రాజు, ఈవో పీఆర్‌ఆర్‌డీ సోమశేఖరరెడ్డి, ఉద్యాన శాఖాధికారి శివకుమారి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం నుంచి రామచంద్రాపురం ప్రధాన కూడలి వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోనూ విక్రయాలా!

● పట్టించుకోని విజిలెన్స్ అధికారులు



వినియోగంలో లేని మొబైల్ టాయిలెట్‌లో నిల్వ ఉంచిన టెట్రా జ్యూస్ ప్యాకెట్లు

తిరుమల, మార్చి15(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో తినుబండారాలను విక్రయిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్1, 2లోని కంపార్టుమెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉంటారు. వీరికి టీటీడీ ఉచితంగా అన్నప్రసాదాలను అందజేస్తోంది. కంపార్టుమెంట్లలోని భక్తులకు ప్రైవేట్ వ్యక్తులు తినుబండారాలను విక్రయించడాన్ని టీటీడీ నిషేధించింది. కొద్దిరోజులుగా ప్రైవేట్ వ్యక్తులు కంపార్టుమెంట్లలోని భక్తులకు తినుబండారాలను విక్రయిస్తున్నారు. టికెట్లు లేని వ్యక్తులకు కంపార్టుమెంట్లలోని ప్రవేశం ఉండదు. హాకర్లు మాత్రం బిస్కెట్లు, జ్యూస్ టెట్రా ప్యాకెట్లు, ఇతర తినుబండారాలను తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 ముందే మొబైల్ టాయిలెట్లలో టెట్రా జ్యూస్ ప్యాకెట్లను నిల్వ చేసుకుని మరీ అమ్ముతున్నారు.

ఏ ఆహారం తినాలో ఆలోచించండి

● ప్రకృతివనం ప్రసాద్



సభలో మాట్లాడుతున్న ప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏ ఆహారం తినాలో శరీరం చెప్పినట్లు వినాలని ప్రకృతి వనం ప్రసాద్ కోరారు. పద్మావతి వర్సిటీలో పబ్లిక్ రిలేషన్ సొసైటీ - జేసీఐ సంయుక్తంగా ఆరోగ్యంపై అవగాహనా సదస్సును శనివారం నిర్వహించాయి. ప్రసాద్ మాట్లాడుతూ ఉపవాసం మనిషి ఆరోగ్యానికి మంచిదన్నారు. చిరుధాన్యాలు మంచివని, అందుకే వాటిని ఆహారంగా తీసుకోవాలని అన్నారు. సాయంత్రం పూట త్వరగా ఆహారం తినాలన్నారు. గూట్లో దీపం - నోట్లో ముద్ద నానుడిని ప్రస్తావించారు. వర్షపు నీరు ఆరోగ్యానికి మంచిదని, అయితే, దీన్ని శుద్ధి చేసుకుని తాగవచ్చని అన్నారు. శ్రమ చేయడం ద్వారా కూడా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లను సమీక్షించుకోవాలన్నారు. జేసీఐ జోన్ చైర్మన్ కిషోర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు రసాయనాలతో పండించిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమను సత్కరించారు. రిజిస్ట్రార్ రజని, పీఆర్ఎస్ఐ తిరుపతి శాఖ చైర్మన్ శ్రీనివాసరావు, దుద్యాల చంద్రమోహన్, చక్రవర్తి రాఘవన్ ఉపాధ్యక్షులు శంకర్, మాజీ చైర్మన్లు త్రిపురసుందరి, స్వరాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని నారద పుష్కరణికి పడమర వైపున ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సిబ్బంది అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది. షాపింగ్‌మాల్‌లోని నాలుగవ అంతస్తులో ఉన్న వంటగదితో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ప్రమాదం సంభవించింది. సిబ్బంది హుటాహుటినా మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సహా అక్కడికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. ఎలాంటి నష్టం వాటిల్లలేదని ధ్రువీకరించారు

ఉద్యోగమేళాలో 25మంది ఎంపిక

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగమేళా నిర్వహించారు. ఐదు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 50మంది అభ్యర్థులు పాల్గొనగా 25మంది ఎంపిక య్యారు. వారికి ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు వేతనం, ఇతర అలవెన్సులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, జేకేసీ కో-ఆర్డినేటర్ గంగారామ్, అధ్యాపకులు సతీష్‌కుమార్, గిరిజమ్మ పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ఉచిత శిక్షణకు నేడు నమూనా పరీక్ష

తిరుపతి(విద్య), మార్చి15(ఆంధ్రజ్యోతి): భవానీనగర్ రాజన్నపార్క్ సమీపంలోని శ్రీగగన కోచింగ్ కేంద్రం ఆధ్వర్యంలో ఏఈపీసెట్‌లో ఉచిత శిక్షణకు ఆదివారం ఉదయం 9గంటలకు నమూనా పరీక్షని నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎ.కరుణామూర్తి పేర్కొన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకోసం 9553590099, 9553490099 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్యాబ్ డ్రైవర్ల నిరసన

తిరుచానూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉబెర్ క్యాబ్ డ్రైవర్లు శనివారం తిరుచానూరు పంచాయతీ చైతన్యపురం వద్ద నిరన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం అనేక రకాల ఇబ్బందులు పెడుతోందన్నారు. సంస్థ ప్రతినిధులు తిరుపతిలో ఉండటం లేదన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ చొరవ తీసుకోవాన్నారు. గిరిబాబు, ఖాదర్‌బాషా, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎంబీఏ విభాగంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంబీఏ ప్రొఫెసర్ విజయలక్ష్మి, వినియోగదారుల వేదిక అధ్యక్షుడు రాజారెడ్డి, లీగల్ మెట్రాలజీ ఏసీ స్వామి మాట్లాడారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా వస్తువుల నాణ్యత, ప్రమాణాలు, కల్తీ, ధర, భద్రత గురించి తెలుసుకోవచ్చన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న ఊంజల్ సేవ



నారాయణవనం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం లో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

● అధికారులకు జిల్లా ప్రత్యేకాధికారి కోన శశిధర్ సూచన



అధికారులతో సమీక్షిస్తున్న శశిధర్, కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా పథకాల అమలు పారదర్శకంగా ఉండాలని జిల్లా ప్రత్యేకాధికారి కోన శశిధర్ అధికారులకు సూచించారు. జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారీ లక్ష్య సాధన దిశగా పనితీరు ఉండాలన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులకు జర్మనీ, ఇటలీ దేశాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఆ మేరకు యువతకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీడీపీ గ్రోత్ రేట్ 16 శాతం పైగా సాధించే దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్షలో తిరుపతి కమిషనర్ మౌర్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.



భక్తులకు ఉపశమనం

తిరుమలలో వేసవితాపం నుంచి భక్తులకు ఉపశమనం కల్పించేలా టీటీడీ నిరంతరం వాటర్ ట్యాంకర్ల ద్వారా శ్రీవారి ఆలయ మాడవీధులను నీటితో చల్లబరుస్తోంది. మాడవీధుల్లో పాదరక్షలతో తిరగడం నిషేధం. ఈక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు దఫాలవారీగా నేలభాగాన్ని నీటితో తడుపుతూ భక్తులకు ఊరట కల్పిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వైసీపీలో అంతా వాళ్లేనా?

● వైరల్ అవుతున్న వైసీపీ నేత బొమ్మగుంట రవి వీడియో

తిరుపతి (జీవకోన), మార్చి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీలో అంతా వాళ్లేనా.. బీసీలు ఎంత కష్టపడ్డా ఇంతేనా? అంటూ వైసీపీ నాయకుడు బొమ్మగుంట రవి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు తిరుపతిలో వైరల్ అవుతోంది. వైసీపీ కార్యకర్తల్లోనూ చర్చగా మారింది. "నగర అధ్యక్షుడు రెడ్డే, జిల్లా అధ్యక్షుడు రెడ్డే, జిల్లా కోఆర్డినేటర్ రెడ్డే, ఇదీ వైసీపీలో పరిస్థితి" అని వైఎస్ఆర్ వీరాభిమాని, రజక సంఘం నేత, ఆ పార్టీ నాయకుడు బొమ్మగుంట రవి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అభినయ్‌రెడ్డిలను ఉద్దేశించి వీడియోలో ప్రశ్నించారు. 'తిరుపతి వైసీపీ నగర అధ్యక్షుడిగా మల్లం రవిచంద్రారెడ్డి ఉన్నన్ని రోజులు నా ఎడమ కాలు కూడా వైసీపీలో పెట్టను' అంటూ ప్రకటించారు. ఈ వీడియోపై ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఆయనను సంప్రదించగా, 'నిజాయితీగా పార్టీలో పనిచేశా... ఎన్ని ఇబ్బందులు ఎదురైనా టీకేఆర్ కోసం(భూమన కరుణాకరరెడ్డి కోసం) పనిచేశా... నగర అధ్యక్ష పదవిని దుద్దేల బాబుకు(కాపు)కు ఇస్తే బాగుంటుందని అడిగా. తరువాత బీసీగా నాకు ఇవ్వాలని కూడా అడిగా. అయినా పట్టించుకోలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను మరచిపోయిన పార్టీ మనుగడ సాగించదు' అని అన్నారు. ఎంత కష్టపడినా పార్టీలో తగిన గుర్తింపు లేకపోవడంతోనే మనసులోని మాటను తెలియజేశానన్నారు.

వెటర్నరీలో చిరుత సంచారంపై కలకలం

తిరుపతి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో శనివారం ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పలు చోట్ల చిరుత సంచరించిందన్న ప్రచారం విస్తృతంగా నడిచింది. ఉదయం 9గంటలకు ఫిగరీ డిపార్ట్‌మెంట్ వద్ద, 11.30 గంటల సమయంలో హాస్టల్స్, ఫిజియాలజీ, న్యూట్రీషియన్ విభాగాలు, రాత్రి 9గంటల సమయంలో వెటర్నరీ, అగ్రికల్చర్ కాలేజీలకు మధ్య ఉన్న ప్రహరీ వద్ద చిరుత సంచరిస్తూ పలువురి కంట పడిందన్న సమాచారం ఉద్యోగ, అధ్యాపక, విద్యార్థి వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. చిరుత సంచారాన్ని ఫొటో తీసేందుకు కొందరు వేచి చూడగా చెట్లపొదల నుంచి బయటకు రాలేదని చర్చించుకుంటున్నారు. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించినట్లు సమాచారం.

జిల్లా అభివృద్ధికి రూ.10లక్షల విరాళం


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న అల్తాఫ్ షేక్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా జిల్లా అభివృద్ధి కోసం బర్షన్ ఫైప్ సపోర్టు కంపెనీ తరపున శ్రీసిటీ మేనేజరు అల్తాఫ్ షేక్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు రూ.10లక్షలు చెక్కు అందజేశారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో శ్రీసిటీ ప్రతినిధి భగవాన్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య కళాశాలపై రౌడీ మూకల దౌర్జన్యం

● ఫర్నిచర్ ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీచైతన్య కళాశాలపై కొందరు రౌడీ మూకలు దౌర్జన్యం చేసి కళాశాలలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు... స్థానిక పూల వానిగుంటలో వున్న శ్రీచైతన్య కళాశాల ముందు కొందరు ఆకతాయిలు నడుచుకుంటూ వెళుతున్నారు. అదే సమయంలో కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు ముగిసిన సందర్భంగా బయట సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అల్లరి మూకలు వీరిని వారించడంతో భయపడి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై గిరీషా, సతీష్ మరో ఐదుగురిని ప్రిన్సిపాల్ ప్రశ్నించడంతో రెచ్చిపోయిన రౌడీమూకలు ఉన్న పళంగా మద్యం మత్తులో కళాశాల గేటు ముందు వున్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి సీఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు.

రేణుకా పరమేశ్వరికి సారె సమర్పణ


అమ్మవారిని దర్శించుకున్న మేయర్ దంపతులు

తిరుపతి అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పరసాలవీధిలోని రేణుకా పరమేశ్వరి అమ్మవారికి శనివారం మధ్యాహ్నం నగర మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్ దంపతులు సారె సమర్పించారు. అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మేయర్ దంపతులు ఆలయం వద్దకు చేరుకోగా అర్చకులు ఘనంగా ఆహ్వానించారు. సారె సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

చిన్నారుల ఆరోగ్య భద్రతకు వ్యాక్సిన్లు తప్పనిసరి



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డలకు వచ్చే వ్యాధులను అరికట్టడంలో వ్యాక్సిన్లు ఎంతగానో ఉపయోగపడతాయని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ పేర్కొన్నారు. ఇమ్యునైజేషన్ డే, మీజెల్స్ ఇమ్యునైజేషన్ డే కార్యక్రమాన్ని స్విమ్స్ సర్కిల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచి రోగాలను నివారించడంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తీవ్రమైన అంటువ్యాధులను నివారించడంలో మీజెల్స్ ఎంతగానో పనిచేస్తాయన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డ ఒక వయసుకు వచ్చే వరకు క్రమం తప్పక వ్యాక్సిన్లు వేయడం వలన వారు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. ఇమ్యునైజేషన్ అధికారి శాంతికుమారి, వైద్యాధికారులు శ్రీనివాస్, మురళి, ఉషా కళావత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేకాధికారిని కలిసిన ఎమ్మెల్యే నాని



తిరుపతి (కలెక్టరేట్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి కోన శశిధర్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే చంద్రగిరి అభివృద్ధిపై చర్చించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ హరికృష్ణ

తిరుపతి(విద్య), మార్చి 15(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తిరుపతి ఎక్సైజ్ ఎస్ఐ హరికృష్ణ విద్యార్థులకు సూచించారు. సెట్విన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహనా కార్యక్రమం స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎక్సైజ్ ఎస్ఐ హరికృష్ణ మాట్లాడుతూ... డ్రగ్స్ వాడినా, విక్రయించినా కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. సెట్విన్ మేనేజర్ చక్రినాయక్ మాట్లాడుతూ... చెడు అలవాట్లకు బానిసలైతే విలువైన జీవితాన్ని కోల్పోతారంటూ సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్వీ రమణకుమార్, బయోమెడికల్ ఇంజనీరింగ్ హెడ్ ఆర్.ఉదయ్‌కుమార్, ఇంగ్లీష్ లెక్చరర్ పి.అపర్ణ, జనరల్ సెక్షన్ హెడ్ ఎస్వీ గౌరీశంకర్, సీనియర్ లైబ్రేరియన్ నటరాజ్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా నగర సంకీర్తనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): గోవిందనామ స్మరణతో శనివారం వేకువజామున భక్తులు సంప్రదాయ దుస్తులు, మేళతాళాలతో చేపట్టిన నగర సంకీర్తనం వేడుకగా సాగింది. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విక్రం, వాసు, గంగయ్య, కళ్యాణి, జయమ్మ, పద్మావతి, సురేంద్రరాజు, మునినాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసులు... కాసులపై మోజు

చైతన్యం కల్పించడంలో లేదు క్రేజు ● ఆపోజిట్ రోడ్లలో వస్తున్న వాహనదారులపై పోలీసుల ప్రతాపం




ఆపోజిట్ రోడ్డులో వెళుతున్న వాహనాలు - కేసులు రాస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రధాన రహదారి సమీపాన ట్రాఫిక్ పోలీసులు అనుసరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస అవగాహన కల్పించకుండా, నిబంధనలు సూచించే బోర్డులు పెట్టకుండా తమ ముక్కు పిండి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారంటూ వాహన చోదకులు లబోదిబోమంటున్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవడం సమర్థనీయమే అయినా అడ్డగోలుగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయడం తగదంటున్నారు. తిరుచానూరు నుంచి చెన్నై వెళ్లే మార్గంలో, కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో ఎడమవైపుగా రేణిగుంట రోడ్డులోని కాటన్‌మిల్లు వద్దకు చేరుకోడానికి ఓ రోడ్డు నిర్మించారు. కొన్నాళ్లుగా ఈ మార్గంలో కాలనీలు బాగా అభివృద్ధి చెందాయి. తాజాగా ఈ మార్గంలో ఓ నిబంధన విధించారు. బైపాస్‌లోని తిరుచానూరు - నారాయణాద్రి ఆస్పత్రి కూడలి నుంచి ఎంఎస్ఎం పెట్రోలు బంకు వైపు వెళ్లే వాహనాలను అడ్డుకుంటున్నారు. తిరుచానూరు ఫ్లైవోవర్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని రావాలంటున్నారు. ఈమార్గంలో వచ్చేవారికి ఇది తలనొప్పిగా తయారైంది. దూరాభారం కావడంతో ఇబ్బందిగా పరిణమించింది. ఇలా రాకపోకలు సాగించడం నిషేధమంటూ ట్రాఫిక్ పోలీసులు కనీసం ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయడం గాని, బోర్డులను ప్రదర్శించడం గాని చేయలేదు. చాన్నాళ్లుగా వస్తున్న ప్రయాణికులను తాజాగా అడ్డుకుని అపరాధ రుసుం వేస్తున్నారు లేకుంటే పోలీస్ స్టేషనుకు రమ్మంటున్నారు. కూడలిలోనే ఓ కానిస్టేబుల్‌ను ఉంచితే వాహనదారులు అటుగా రాకుండా ఉంటారు. అలా కాకుండా వాహనదారులు ముందుకు వచ్చిన తర్వాత పెట్రోలు బంకు వద్ద పోలీసులు నిలబడి కేసులు నమోదు చేసి కాసులు ఆర్జించాలనుకోవడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి ట్రాఫిక్ ఎస్ఐ ఒకరు వాహనదారులపై జులుం ప్రదర్శించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అవగాహన కల్పించడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గురుకుల పాఠశాలలో

మౌలిక సదుపాయాలు కల్పించండి


జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న విభు నాయర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులను సరైన సమయంలో ఖర్చు చేసి వాటి వివరాలు సమర్పించాలని, జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయాలని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ కార్యదర్శి విభు నాయర్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో పలు అంశాలపై శనివారం సమీక్షించారు. ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ పథకం కింద ఎంపిక కాబడిన మూడు గ్రామాల గురించి సమీక్షించారు. మిగిలిన గ్రామాలను కూడా చేర్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ సదా భార్గవి, కార్యదర్శి మల్లికార్జున నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



రుయాలో పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది - ఈఎస్ఐ ఆస్పత్రిలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న పరిసరాలు బాగుంటే మనం బాగుంటామని దానిని దృష్టిలో పెట్టుకొని పర్యావరణ రక్షణ మన బాధ్యతగా నిర్వర్తించాలని రుయాస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రుయాస్పత్రిలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది కలిసి శనివారం ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతకు సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ రక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవుదామని ప్రతిజ్ఞ చేశారు. సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, డీసీఎస్ ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ, ఉద్యోగ సంఘ నేతలు వరప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో...

స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిలో ఎంఎస్ శ్యాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది మానవహారం, పర్యావరణ రక్షణకు సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే ఎస్వీ వైద్య కళాశాలలోనూ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

బడి భవనంపై నుంచి పడిన విద్యార్థిని

● గాయాలతో ఆస్పత్రి పాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్నేహ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఒక కార్పొరేట్ పాఠశాలలో శనివారం సాయంత్రం దారుణం చోటు చేసుకుంది. తొమ్మిదవ తరగతి చదువుతున్న స్నేహ పాఠశాల భవనం రెండవ అంతస్తు నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైంది. ఈ బాలిక తిరుచానూరు పాడిపేటకు చెందిన మునిరత్నంరెడ్డి కుమార్తె. శనివారం సాయంత్రం మిద్దెపై నుంచి కింద పడడంతో బాలిక చేతులు, కాళ్లు, తలపై బలమైన రక్తగాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. గాయపడిన బాలికను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించడం గురించి నిర్వాహకులను ప్రశ్నించారు. పాఠశాలలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో ఘటనకు దారి తీసిన కారణాలు తెలియడం లేదు. ఘటనా స్థలానికి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి చేరుకుని విచారించారు. డీఎస్పీ శ్రీలత, సీఐ రామకృష్ణ, ఎస్ఐ గిరిబాబు, మరో ఇద్దరు ఎస్ఐలు పాఠశాలలో విచారణ చేస్తున్నారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

నేడు కళారత్న పురస్కారాల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి కళారత్న పురస్కారాలను ఆదివారం ప్రదానం చేయనున్నారు. యూత్ హాస్టల్లో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని నిర్వాహకులు ఉషారాణి తెలిపారు.

సీబీఎస్ స్టాల్స్‌లో ప్లాస్టిక్ నిషేధం


సెంట్రల్ బస్సుస్టేషన్‌లోని హోటల్లో తనిఖీ చేస్తున్న డీపీటీవో నరసింహులు, ఇతర అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 15(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ఉన్న దుకాణాల్లో ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తే రూ.5వేల జరిమానాతో పాటు షాప్‌లైసెన్స్ రద్దు చేస్తామని డీపీటీవో జి.నరసింహులు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం సీబీఎస్‌లో స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్మికులను ఏర్పాటుచేసి బస్టాండు మొత్తం శుభ్రపరిచారు. మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఇన్‌గేట్ వద్ద ఆక్రమణలను తొలగించి జేసీబీతో చదును చేయించారు. ప్రతి దుకాణాన్ని సందర్శించి ఎమ్మార్పీధరలకు విక్రయించాలని, పరిసరాలు శుభ్రం ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్ర నాయుడు, ఈఈ లక్ష్మీనారాయణ, సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్

నగర శివారు ప్రాంతాలైన శెట్టిపల్లి, సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం 2, తిరుమలనగర్ గ్రామ సచివాలయాల పరిధిలోని పలు కాలనీల్లో నిర్వహించిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతో ప్రమాణం చేయించారు. వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్లాస్టిక్ నిషేధించాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా తమ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఐదు గ్రామ సచివాలయాల కార్యదర్శులు మురళి, స్వాతి, నాగరాజులు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం... పరిశుభ్రత పోలీసు లక్ష్యం: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం): పర్యావరణాన్ని కాపాడుకుంటూ పోలీసు స్టేషన్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్‌లో భాగంగా శనివారం అన్ని అదనపు ఎస్పీ కార్యాలయాలు, డీఎస్పీ, సీఐల కార్యాలయాలు, పోలీసు స్టేషన్లు శుభ్రం చేశారు. చెత్తా చెదారం తొలగించారు.

ఎస్వీయూలో...

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ కాలేజీలు, విభాగాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొని యూనివర్సిటీ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ కోసం తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థులు, ఉద్యోగులందరి చేత వర్సిటీ ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ప్రతిజ్ఞ చేయించారు. పలు విభాగాల విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

తిరుపతి(ఆటోనగర్): రోజు రోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే విరివిగా మొక్కలు నాటాలని తిరుపతి టౌన్ ఈఈ వి.చంద్రశేఖరరావు వెల్లడించారు. టౌన్ డివిజన్ పరిధిలో గోవిందరాజస్వామి ఆలయ సమీపంలోని వెస్ట్ విద్యుత్ సెక్షన్‌లో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఈ ఈఈ పి.ఆంజనేయులు, ఏఈ మునిరామ్, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఈ కార్యాలయంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు మొక్కలు నాటినట్లు పీఆర్వో మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ భాస్కర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.





పోలీస్‌స్టేషన్‌లో శుభ్రం చేస్తున్న సిబ్బంది - విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు - వెస్ట్ విద్యుత్ సెక్షన్‌లో మొక్కలు నాటుతున్న ఈఈ వి.చంద్రశేఖరరావు

శేషాచలం స్నేక్స్



కార్తీక్ కెమెరాకు చిక్కిన అరుదైన పాములు

బర్డ్‌మెన్ కార్తీక్

మన దేశంలోని పాముల జాతులు చాలావరకు విషపూరితం కానివే. మానవులకు ఎటువంటి హానీ కలిగించవు. విషపూరిత జాతులు కూడా ఆత్మరక్షణ కోసమే కాటువేస్తాయి. పర్యావరణ వ్యవస్థలో వీటి పాత్ర కీలకమైంది. పాముపల్ల మనిషికన్నా.. మనిషి వల్లే పాముకి ప్రమాదం ఎక్కువ.

కామన్ ట్రింకెట్ : నగరవనంలో కనిపించిన విషరహిత సర్పం

అడవుల్లో పిట్టలను, పుట్టలను ఫొటోలు తీయడం 'బర్డ్‌మన్' కార్తీక్‌కు లెన్స్‌తో పెట్టిన విద్య. కానీ పుట్టలో, చెట్టులో దాక్కున్న పాములను కూడా తన కెమెరాతో బంధించి బర్డ్‌మెన్ కాస్త స్నేక్‌మన్ అయ్యాడు. శేషాచలంలో దాక్కున్న సరీసృపాల వెంట పడ్డాడు. రక్తపింజరి, ఎగిరే పాము, ఇండియన్ కోబ్రా, ఇండియన్ రాక్ పైథాన్, ఇండియన్ స్పెక్టాకిల్ కోబ్రా, రంపపు సాక్లెడ్ వైపర్, వెదురు పిట్ వైపర్, బార్డ్ వోల్ఫ్ స్నేక్, కామన్ ట్రింకెట్, వైన్ స్నేక్, బ్రౌన్‌మార్ఫ్, రంపపు స్కేల్డ్ వైపర్, బ్యాండెడ్ క్రైట్ ...ఇలా అనేక రకాల అరుదైన పాములను వెతికి, వెతికి ఫొటోలు తీసి పర్యావరణ ప్రపంచానికి పరిచయం చేశాడు. పాములు సహజంగా చిటారు కొమ్మలు, పగిలిన రాళ్ల సందులు, జలాశయాలు, బొరియలు.. వంటి చోట్ల ఆవాసాలను ఏర్పాటుచేసు కుంటాయి. కొన్ని జాతులు పగటి పూట మాత్రమే బయట తిరుగుతాయి. మరి కొన్ని రాత్రి పూట మాత్రమే సంచరిస్తాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


సాస్కాల్డ్ వైపర్ : (చిన్న పింజరి)- కరకంబాడి అటవీ ప్రాంతంలోని విషపూరిత స్పరం

ఇండియన్ స్పెక్టాకల్ కోబ్రా (నాగుపాము) : తిరుపతి జంగిల్ బుక్‌లో కనిపించిన విషపూరిత సర్పం

నేటి నుంచి తిరుపతి-హుబ్లీ, కాట్పాడి ప్యాసింజర్ల రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి హుబ్లీ, కాట్పాడి మధ్య రాకపోకలు నిర్వహిస్తున్న ప్యాసింజర్లను ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి-హుబ్లీ మధ్య (57401-57402) ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తిరుపతి నుంచి హుబ్లీ ప్యాసింజరు ఆదివారం ఉదయం 6.05 గంటలకు బయలుదేరి వెళుతుందని చెప్పారు. తిరుపతి-కాట్పాడి మధ్య (67209-67210) మెము రైళ్లరాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిలో ఈ మెము ప్యాసింజర్ రైలు ఆదివారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీసిటీ సెక్యూరిటీ మేనేజర్‌పై హత్యాయత్నం

- ఐదుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ డిప్యూటీ సెక్యూరిటీ మేనేజరుపై హత్యాయత్నానికి పాల్పడ్డ ఐదుగురిపై శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీసిటీ పరిధిలోని తొండూరు సొసైటీ కాలనీకి చెందిన మునస్వామి రెడ్డి నుంచి సర్వే నెంబరు 18/2లో ఉన్న సుమారు 3.90ఎకరాల మాగాని భూమిని శ్రీసిటీ వారు కొనుగోలు చేశారు. ఆ భూములకు కంచె ఏర్పాటు చేసే పనులను శుక్రవారం మొదలు పెట్టారు. పనులు జరుగుతున్న సమయంలో సొసైటీ కాలనీకి చెందిన పిళ్లారి రఘుపతి, అతని భార్య లక్ష్మి, బావమరిది తనికులం శీను, అతని భార్య విశాలాక్షి, కుమారుడు దేవేంద్ర ఆ భూములు తమవేనని పనులను అడ్డుకోవాలని శ్రీసిటిలోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించారు. శ్రీసిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఆ భూములను తాము అమ్మలేదని గొడవకు దిగారు. నిబంధనల ప్రకారం 2007లో ఈ భూములను శ్రీసిటీ కొనుగోలు చేసింది. దానికి సంబంధించిన రికార్డులు చూపినా వారు వినిపించుకోలేదు. అక్కడ విధుల్లో ఉన్న శ్రీసిటీ మహిళా భద్రతా సిబ్బందిపై దాడులకు యత్నించారు. ఈ క్రమంలో శ్రీసిటీ డిప్యూటీ సెక్యూరిటీ మేనేజరు కోటేశ్వరరావుపై పెట్రోల్ పోసి తగులపెట్టడానికి యత్నించారు. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ హత్యాయత్నం కేసు నమోదు చేసి, రఘుపతి, శీను, దేవేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ శ్రీసిటీలో ప్రశాంతతే ముఖ్యమని, భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేటి నుంచి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫారెస్టు సర్వీస్(స్క్రీనింగ్ టెస్టు), ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆదివారం నుంచి రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఆర్వో దేవేంద్రరెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలను తిరుపతి జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్, పుత్తూరులోని వెంకట పెరుమాల్ కళాశాల, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1,634 మంది హాజరుకానున్నారని, దీనికి తగినట్లు కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.2.88 కోట్లు, శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,987 తలనీలాలు సమర్పించినవారు: 26,880.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు







శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు


మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు


కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు


కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ


కల్యాణ్యాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు

పుత్తూరు వార్తలు

అభివృద్ధికి ఆమోదం తెలిపేది లేదు

- పుత్తూరు వైసీపీ కౌన్సిలర్ల ప్రతీకార నిర్ణయం
- చైర్మన్ తీరుపై అసంతృప్తి
- రసాభాసగా పుత్తూరు మున్సిపల్ సమావేశం



చైర్మన్ తీరును ప్రశ్నిస్తున్న వైసీపీ కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం

పుత్తూరు అర్బన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపేది లేదని వైసీపీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. టీడీపీ కౌన్సిలర్లతో పాటు పాలకపక్షమైన వైసీపీ వారు కూడా పలు అభివృద్ధి పనులపై చైర్మన్‌ను ప్రశ్నించడంతో అసంతృప్తి వ్యక్తం కావడంతో శనివారం జరిగిన మున్సిపల్ సమావేశం రసాభాసగా మారింది. తొలుత వైసీపీ కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ నాలుగేళ్లుగా నచ్చినట్లు అజెండా రూపొందించుకోవడం, ఆమోదించుకోవడం తప్ప ఒక్కసారి కూడా కౌన్సిలర్లతో చర్చించకోవడం ఏమిటని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా తమ వార్డుల్లో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదని దీంతో ప్రజలకు సమాధానం చెప్పలేకున్నామని వైసీపీ కౌన్సిలర్లు జయలక్ష్మీ, హేమలత విచారం వ్యక్తం చేశారు. తమ వార్డుల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ స్పష్టం చేశారు. 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కేశవాచారి ఎన్నికను కోర్టు రద్దు చేసిందని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని వైసీపీ కౌన్సిలర్‌లు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ట్రాఫిక్ ఇబ్బందులు, అక్రమ లేఔట్ల నియంత్రణకు చర్యలు చేపట్టాలని టీడీపీ కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు కోరారు. పట్టణంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రత్యేక కమిటీ రూపొందించనున్నట్లు తెలిపారు. కాగా అజెండాలో 13 అంశాలు పొందపరచగా 10 అంశాలు వేతనాలు, ఆదాయపు పన్ను చెల్లింపులు, మార్కెట్ బహిరంగ వేలం వంటివి ఆమోదించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన మూడు అంశాలను పక్కన పెట్టేశారు. 2019-24 మధ్య మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అసెంబ్లీ వేదికగా విచారణ కోరిన క్రమంలో అధికార పాలకవర్గం ఇలా ప్రతీకార చర్యకు దిగింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్‌లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చీపురు చేతపట్టిన కమిషనర్..!



పుత్తూరు అర్బన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. మూడవ శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మాస్ క్లీన్ డ్రైవ్, పిచ్చి మొక్కలు తొలగింపు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, డీఈ చంద్రశేఖర్, ఏఈలు కార్తికేయ, రమేష్‌లు చీపురుతో చెత్తను తొలగించారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ మార్కెట్ వద్ద ఉన్న వాణిజ్య సముదాయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టుబడిన ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మల్లాలమ్మ జాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



పుత్తూరు అర్బన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): ఆరేటమ్మ కాలనీలో కొలువుదీరిన మల్లాలమ్మ జాతరను మేదర సంఘం అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. శనివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మేదర సంఘం సభ్యులు కలిసి జాతరకు ఆహ్వానించారు. మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తామని, ఆదివారంతో ముగియనుందని మేదర సంఘం సభ్యులు తెలిపారు.

విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల పింఛన్ల కమ్యుటేషన్ రికవరీ నిలుపుదల

పుత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసి గత ఏడాది అక్టోబరు నాటికి 11 సంవత్సరాల 3 నెలలు పూర్తయిన విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల పింఛన్లలో కమ్యుటేషన్ రికవరీని నిలుపుదల చేయాలని శనివారం ఎస్పీడీసీఎల్ ఆదేశాలు జారీ చేసిందని డిస్కమ్ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి వేణుగోపాల్ అయ్యర్ తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఇప్పటికే ప్రభుత్వం రికవరీని నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులతో లబ్ధిపొందుతున్న విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యత, ఎమ్మార్పీపై అవగాహన ఉండాలి



పుత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వస్తువుల నాణ్యత, ఎమ్మార్పీ పట్ల వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల కన్స్యూమర్స్ క్లబ్ కన్వీనర్ వాసవి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దేవకి, తిరుమలయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కోసం కృషి చేయండి



పుత్తూరు టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతిఒక్కరు సహకరించాలని టీడీపీ నాయకులు, తడుకు సర్పంచ్ బొబ్బలి యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం తడుకు పంచాయితీలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి



మృతి చెందిన రవి

తడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలబడి ఉండగా లారీ ఢీకొనడంతో తమిళనాడువాసి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రంలోని ఆరంబాకం గ్రామానికి చెందిన కె.రవి(57) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తడ మండలంలోని రామాపురం గ్రామం వద్దకు వచ్చాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలబడి ఉండగా చెన్నై వైపు వెళ్లే లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి తల పగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని స్థానికులు ఎలావూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపహరణకు గురవుతున్న ఆవులు

ఆందోళనలో పాడిరైతులు



రాత్రిపూట బొలెరో వాహనంలో వచ్చి ఆవులను అపహరించుకుపోతుండగా సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

గూడూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోజురోజుకూ గోవుల అదృశ్యం ఘటనలు జరుగుతుండడంతో పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో గోవులను అపహరించి వాహనాల్లో తరలించుకుపోతున్నారు. గత 20 రోజుల్లో సుమారు 60కి పైగా గోవులు అదృశ్యం అయినట్లు తెలిసింది. రాత్రి సమయాల్లో రోడ్లపై సంచరించే ఆవులు సైతం గత కొద్దిరోజులుగా కనిపించపోతుండడంతో వాటిని కూడా అపహరించుకు వెళ్లి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని తిలక్‌నగర్, గాంధీనగర్, ఇందిరానగర్, జానకిరామ్‌పేట, జనార్దనరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో ఆవులు అదృశ్యమవుతున్నాయి. ఇప్పటికే జానకీరామ్‌పేటకు చెందిన సుబ్బారెడ్డి, సుధాకర్, గాంధీనగర్‌కు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ఇందిరానగర్‌కు చెందిన గోపాలయ్య తమ ఆవులను అపహరణకు గురైనట్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం స్థానిక నిమ్మ మార్కెట్ ప్రాంతంలో ఎద్దుల బండికి కట్టి ఉంచిన ఎద్దును కొందరు అపహరించుకుని వెళ్లారు. రెండు రోజుల క్రితం కొందరు గోవులను అపహరించి అక్రమంగా వాహనంలో తరలిస్తుండడం సీసీ కెమెరాలలో నమోదైంది. లక్షల రూపాయల విలువ చేసే ఆవులు అదృశ్యం అవుతుండడంతో పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. గోవులను దైవంగా భావిస్తూ, పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, అటువంటిది కొందరు దొంగతనాలకు పాల్పడుతుండడంపై యజమానులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేసి ఆవులను అపహరించే ముఠాను పట్టుకుని, గోవుల దొంగతనాలను నియంత్రించాలని పాడిరైతులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదు



ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సక్రమంగా పనిచేస్తే గ్రీవెన్స్ డేకు ఇంతమంది ప్రజలు రారన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. పేదలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా త్వరితగతిన వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, కనుమూరు హరిచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య, తహసీల్దారు చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలుడి రథోత్సవం



మంగళంపాడు వీధుల్లో భక్తుల నడుమ రథోత్సవం



రథంలో స్వామి, అమ్మవార్లు

సూళ్లూరుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామ గోదా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామా, వేణుగోపాలుడి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను స్వర్ణ దివ్యాభరణాలతో అలంకరించి రథంపై కొలువుదీర్చారు. భక్తుల కోలాహలం నడుమ స్వామివారి రథం గ్రామ పురవీధుల్లో భక్తులు గోవింద నామస్మరణలు పలుకుతూ రథాన్ని లాగుతూ ముందు సాగారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఉదయం నుంచే ఆలయ ప్రధాన వీధి భక్తజనసంద్రంగా మారింది. వంశపారంపర్య ధర్మకర్తలు కిడాంబి శ్రీనివాస రామానుజం, కిడాంబి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రథోత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

గూడూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన ఇటు పర్యావరణానికి, అటు ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. వ్యాపారస్థులకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని, తర్వాత అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, వాటంబేడు శివకుమార్, శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గమళ్లపాళెంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఎమ్మెల్యే గోనె సంచులు పంపిణీ చేశారు. డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

చిట్టేడు ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజ



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

కోట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి పూజ జరిగింది. హెచ్ఎం ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి సహకరించండి



పార్కును పరిశీలిస్తున్న తుడా వైస్ చైర్మన్

సత్యవేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సత్యవేడులో తుడా నిధులతో ఏర్పాటు చేస్తున్న ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆది మూలం తుడా వైస్ చైర్‌పర్సన్ మౌర్యను కోరారు. నియోజకవర్గ పరిధిలో తుడా నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ క్రమంలో సత్యవేడులో తుడా నిధులతో చేపడుతున్న పార్కును పరిశీలించారు. పార్కులో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కులో ప్రజలు కూర్చొనేందుకు రాతి బల్లలు మాత్రమే ఏర్పాటు చేసి ఉన్నారని, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు ఉపకరణాలు, పచ్చదనం కోసం చెట్ల పెంపకం తదితర పనులు చేపట్టాల్సి ఉందని ఎమ్మెల్యే ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ పనులన్నీప త్వరగా పూర్తి చేసి ప్రజలకు పార్కును అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె పార్కు పనులు వెంటనే ప్రారంభించి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ తరుణాక్షరెడ్డి, టీడీపీ నాయకులు పరమశివం, చిన్న, ధనశేఖర్, వెంకటరమణ, జనసేన నాయ కుడు బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరూ భాగం కావాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యర్థాల ఏరివేత

పుత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలు, కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి విద్యార్థి, ఉద్యోగి భాగస్వాములు కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం కళాశాల ఆవరణంలో వ్యర్థాలను సేకరించి కాల్చివేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట కృష్ణయ్య, బాబురావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు. ● స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం జరిగింది. క్విజ్ విజేతలకు బహుమతులు అందించారు. పిళ్లారిపట్టు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

లీజు వసూలు చేయండి : సీపీఐ

పుత్తూరు అర్బన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి డి.మహేష్ కోరారు. 2021-24 వరకు దినసరి మార్కెట్, జంతువధ శాల, ప్రైవేటు బస్టాండ్ వేలం ద్వారా రావాల్సిన రూ.48.10 లక్షల లీజును రాబట్టాలని విన్నవించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.

వడమాలపేటలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ



వడమాలపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా వడమాలపేటలో ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో దయాసాగర్, రితేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



వడమాలపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు బహుజన సేవా సంఘం ఆధ్వర్యంలో పరీక్షల సామగ్రిని వితరణ గా అందజేశారు. శనివారం వడమాలపేట బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన 116 మంది విద్యార్థులకు కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దిలీప్‌కుమార్, మునెయ్య, యుగంధర్, భాను, సాయి, నరేంద్ర, హృతిక్, సుబ్రమణ్యం, మదన్, సారథి, ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, సర్పంచులు

తడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీపీ కొలవి రఘురెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి బజారువీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, సర్పంచులు ఆర్ముగం, జయప్రద, వివిధశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల కేంద్రంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ గడ్డం అరుణమ్మ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు చేతపట్టుకుని ఓజిలి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో శైలజ, ఏపీవో ఉషారాణి, సీహెచ్‌వో సుబ్బరామరాజు, ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది ప్రసూన, రవికుమార్, జనార్దన్‌తో పాటు విద్య, వైద్యఆరోగ్య, ఉపాధి శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దక్కిలి: మండల కేంద్రంలో ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని తహసీల్దారు సతీష్‌కుమార్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా దుకాణాల వద్ద బుట్టలు ఏర్పాటు చేసుకొని అందులో వేయాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దారు నిరంజన్‌కుమార్, సర్వేయర్ వెంకటేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోట: మండలంలో కేశవరంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. డీఎల్‌పీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ వేణు ఆధ్వర్యంలో సంపద తయారీ కేంద్రంలో వానపాములు వదిలారు. సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

పెళ్లకూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చదువే అన్నింటికీ మూలమని, విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని టీడీపీ నాయకుడు, కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శిరసనంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమై విద్యా సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి తమ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. అదేవిధంగా ఉత్తీర్ణత సాధించిన ప్రతి ఒక్కరికీ నగదు బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు గుంటపూడి పెంచలయ్య, టీడీపీ నాయకుడు వేలూరు హరిబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రిని అందజేస్తున్న వేలూరు కల్యాణ్‌రెడ్డి

అరణియార్ అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించండి

పిచ్చాటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులకు అదనపు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఆదిమూలం తుడా చైర్‌పర్సన్ మౌర్యకు విజ్ఞప్తి చేశారు. శని వారం ఎమ్మెల్యేతో కలిసి ఆమె అరణియార్ వద్ద చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలిం చారు. పెరిగిన రేట్ల కారణంగా గతంలో తుడా కేటాయించిన రూ.1.85కోట్లు చాలడం లేదని ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అదనంగా రూ.40 లక్షలు నిధులు కేటాయించి పనులు పూర్తికి సహకరించాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఆయకట్టు చైర్మన్‌లు రవిరెడ్డి, పద్దురాజు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఒప్పంద కార్మికులు నిరసన



డైరెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న ఒప్పంద కార్మికులు

రేణిగుంట, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులు రెండు రోజులుగా తమ నిరసనను తెలియజేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విమానాశ్రయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు మూడు షిఫ్టుల్లో వందమంది పైనే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విమానాశ్రయంలోని అధికారులు మధ్య భేదాభిప్రాయాలు కారణంగా ఒప్పంద కార్మికులను విమానాశ్రయం లోపలికి సీఐఎస్ఎఫ్ పోలీసులు అనుమతించడం లేదు. దీంతో ఒప్పంద కార్మికులు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. శనివారం కూడా ఆందోళనకు దిగారు. ఈ విషయంపై ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ మన్నేను వివరణ కోరగా భద్రత నిబంధనలు ప్రకారం తాము అనుమతించిన వ్యక్తుల ద్వారా లోపలికి వెళ్లాలి తప్ప నేరుగా గుంపులుగా వెళ్లేందుకు వీలులేదని స్పష్టం చేశారు.

అభివృద్ధికి సహకరిస్తాం: తుడా వైస్ చైర్‌పర్సన్



వరదయ్యపాళెంలో పర్యటిస్తున్న తుడా వైస్ చైర్‌పర్సన్ మౌర్య

వరదయ్యపాళెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండల అభివృద్ధికి సహకరి స్తామని తుడా వైస్ చైర్‌పర్సన్ మౌర్య అన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చొరవతో శనివారం ఆమె మండలంలో పర్యటించారు. గోవర్ధనపురం వంతెన, వరదయ్యపాళెం డ్రైనేజీలను తుడా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగా చెంగాలమ్మ ఆలయం నుంచి గోవర్ధనపురం వంతెన వరకు మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు ఆణి ముత్యం నందకిషోర్‌రెడ్డి, నిర్మల్, కరుణాకర్‌నాయుడు, జయశంకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఢిల్లీ రాయల్, జనసేన నాయకులు తడ శ్రీను, గ్యాస్ వెంకటేశ్వర్లు, కుమార్, తహసీల్దారు రాజశేఖర్, డీటీ వెంకటసుబ్బయ్య, ఈవోపీఆర్డీ చిరంజీవి, ఈవో బసిరెడ్డి, వీఆర్వో నాగేంద్ర, సుజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్‌ను నిషేధిస్తాం

రేణిగుంట, మార్చి 15: (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్‌ను అంచలంచెలుగా నిషేధిస్తామని ఈవోపీఆర్డీ ప్రభురావు తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్య క్రమంలో భాగంగా మండలంలోని 19 పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పం చులు సచివాలయ సిబ్బంది ప్రజలతో కలిసి గ్రామసభలు నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీలు నిర్వహించి దుకాణ యజమానులకు ప్లాస్టిక్ వాడకంపై నోటీసులు జారీ చేశారు. అలాగే స్థానిక పంచాయితీలో సర్పంచ్ నగేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అంతకు ముందు గ్రామసభ విషయం ఎవరికీ చెప్పకుండా కేవలం పంచాయితీ పారిశుధ్య, కార్మికులు సచివాలయ సిబ్బందితో, గ్రామసభ నిర్వహిస్తారా అని పంచాయితీ అధికారులను జనసేన, వామపక్ష నాయకులు, వార్డు సభ్యులు నిలదీశారు. పంచాయితీ కార్యదర్శి మణి, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం



శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటలో జనసేన నాయకుడు నక్క సాయి మిత్రబృందం ఆధ్వర్యంలో శనివారం ఘనంగాఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి, కాసరం రమేష్, వజ్రం కిషోర్, జనసేన నాయకులు విజయ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రిజిస్ట్రేషన్ పూర్తయితేనే వాహనాన్ని డెలివరీ ఇవ్వాలి

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వాహన రిజిస్ట్రేషన్ పూర్తయితేనే డెలివరీ ఇవ్వాలని శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు స్పష్టంచేశారు. శనివరాం ట్రాక్టర్ షోరూంల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో చాలా ట్రాక్టర్లు నెంబర్లు లేకుండా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ట్రాక్టరు ప్రమాదంలో మరణించినా, గాయపడినా రిజిస్ట్రేషన్ లేకపోవడంతో ఎలాంటి బీమా రాదన్నారు. ఇకపై రిజిస్ట్రేషన్ నెంబర్లు లేకుండా ట్రాక్టర్లు తిరిగితే డీలర్లు, వాహన యజ మానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయానికి వాడే ట్రాక్టరు ట్రైలర్లను వాణిజ్యపరంగా ఉపయోగించరాదని చెప్పారు.

జనసైనికుల అన్నదానం



కేవీబీపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరు గ్రామంలో జనసేన మండల ఉపాధ్యక్షులు మోహన్ ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జనసేన జెండా ఆవిష్కరించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మునిశేఖర్, భార్గవ్, తులసి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

రేణిగుంట, మార్చి 15, (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం మండల పరిధిలోని నాలుగు కేంద్రాల్లో మొదటి సంవత్సరం 1451 మంది, రెండవ సంవత్సరం 1257 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా పటిష్టం



బస్టాండు పరిసరాల్లో డ్రోన్‌తో పర్యవేక్షణ

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో డ్రోన్ కెమెరాతో నిఘాను పటిష్టం చేయనున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కూడలి నుంచి డ్రోన్ కెమెరా ద్వారా పట్టణ పరిసరాలను డీఎస్పీ పరిశీలించారు. అలాగే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే రద్దీ ప్రాంతాలను పరిశీలించి కొందరు వాహనదారులకు జరిమానా విధించారు. శివారుప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలపై డ్రోన్‌తో జల్లెడ పట్టారు.

ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కేవీబీపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలతో మంచి విద్య అందుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందనవసరం లేదని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. రాబోయే విద్యాసంవత్సరం నుంచి ఒక పంచాయతీలోని 3, 4, 5 తరగతుల విద్యార్థుల కోసం ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. 1, 2 తరగతి విద్యార్థులను అంగన్వాడీలకు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే సూరమాల, ఎస్‌ఎల్‌పురంలోని ప్రాథమిక పాఠశాలలకు మూడు రోజుల క్రితం తాళాలు వేశారు. స్పందించిన ఎమ్మెల్యే శనివారం సూరమాలలో తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే పంచాయతీలో ఉన్న పాఠశాలలను అనుసంధానం చేసి ఒక్కో సబ్జెక్టుకు ఒక్కొక్క ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి నాణ్యమైన బోధన అందించనున్నారని తెలియజేశారు. తల్లిదండ్రులు ఒక నిర్ణయానికి వచ్చి తెలిపితే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

పరీక్ష సామగ్రి వితరణ

రేణిగుంట, మార్చి 15, (ఆంధ్రజ్యోతి) : పాత విమానాశ్రయం సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న 67 మంది పదో తరగతి విద్యార్థులకు మానవత సంస్థ సభ్యులు పరీక్షల సామగ్రిని శనివారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఇంద్రాదేవి, ఎంఈఓ-2 రంగనాథయ్య, ప్రిన్సిపాల్ హరిబాబు, మానవతా సంస్థ విద్యా కార్యదర్శి వేణుగోపాల్, ఆరోగ్య కార్యదర్శి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ చేసి గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఈవోపీఆర్‌డీపై సర్పంచుల ఆగ్రహం



ఈవోపీఆర్‌డీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ రవిరెడ్డి

సత్యవేడు, మార్చి 15: సత్యవేడు ఈవోపీఆర్‌డీ తరుణాక్ష రెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండల మీట్‌లో పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, చెరివి ఎంపీటీసీ రామయ్య ఈవోపీఆర్‌డీ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మధురాజు మాట్లాడుతూ తన పంచాయతీలో 2016లో అప్పటి సర్పంచ్ చేసిన ఓ పనికి 2019లో చేసినట్లు చూపించి బిల్లులు పెట్టేందుకు పంచాయతీ తీర్మానం ఇవ్వాలని బెదిరింపులకు దిగారని తెలిపారు. ఈవోపీఆర్‌డీ పంచాయతీల సందర్శనకు వస్తే సర్పంచుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపించారు. ఓ పంచాయతీలో రూ. రెండు లక్షలకు చెరువు వేలం నిర్వహిస్తే అందులో పదిశాతం లంచం అడిగారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి మాట్లాడుతూ తాను రూ.18 లక్షలు నిధులు స్వాహా చేసినట్లు పత్రికల్లో ఉద్దేశ్యపూర్వకంగా రాయించి తనను, తన కుటుంబానికి మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవోపీఆర్‌డీ వైఖరికి నిరసనగా మండల మీట్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు సర్పంచులు ప్రకటించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఎంపీడీవో చంద్రశేఖర్ సర్పంచులకు సర్దిచెప్పడంతో వారు శాంతించారు. పుదుకుప్పం ఎంపీటీసీ శరవణ మాట్లాడుతూ తన సెగ్మెంట్‌లో ఇటీవల డెంగ్యూ జ్వరాలు ప్రబలి 39 మంది అస్వస్థతకు గురైతే దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కొల్లడం ఎంపీటీసీ సెల్వి మాట్లాడుతూ కొల్లడంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ భవనం నిర్మించాలని కోరారు. మినీగోకులాలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఇంకా అందలేదని చిన్నఈటిపాకం సర్పంచ్ గోవిందస్వామి తెలిపారు. సమీప పరిశ్రమల్లోని క్యాంటీన్ల నుంచి తీసుకొచ్చిన వ్యర్థ పదార్థాలను తమ పంచాయతీలో పారవేస్తుండడం వల్ల పరిశుభ్రత లోపించి పందుల బెడద ఎక్కువైందని రాజగోపాలపురం సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుదాం

నారాయణవనం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకుందాం అని ఎంపీడీవో శేఖర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా నారాయణ వనం పంచాయితీ కార్యాలయ అధికారులు, గ్రామస్తులచే శనివారం ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయరాములు, ఏపీఎం, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



హరిత హోటల్ వద్ద ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీకాళహస్తి ఏపీ టూరిజం హరిత హోటల్ మేనేజరు పరమేష్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించడంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, వుడెన్ స్పూన్లు వంటివి ఉపయోగించాలన్నారు.

'శక్తి'తో మహిళలకు రక్షణ



శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన శక్తి యాప్ మహిళలకు మహారక్షణగా నిలుస్తుందని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో విద్యార్థులకు శక్తి యాప్‌పై డీఎస్పీ నరసింహమూర్తి పోలీసు అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకో వాలన్నారు. అత్యవసర సమయంలో యాప్ ద్వారా సందేశం పంపడంతో తక్షణం పోలీసు యంత్రాంగం సహాయక చర్యలు అందిస్తుందని వివరించారు. కాగా టూటౌన్ సీఐ వెంకటేశ్వరరావు జ్ఞాన ప్రసూనాంబిక నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు.

మొక్కలు నాటాలి



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ మొక్కను నాటి సంరక్షించాలని ఎంఈవో-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని చిన్న పాలేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు. హెచ్‌ఎం శైలజ, సర్పంచ్ రత్నమ్మ, ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

కేవీబీపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగలో టీడీపీకి చెందిన కార్యకర్త మహిళ శివగామి, వగత్తూరు టీడీపీ మాజీ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి సతీమణి జయలక్ష్మి(78) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం ఆయా గ్రామాలకు చేరుకుని వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేశవులునాయుడు, పిచ్చాటూరు ఇళంగోవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మణి, సర్పంచ్ బాలాజీ, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులోని టీచర్స్ కాలనీకి చెందిన ఈశ్వర్ అనే యువకుడు హఠాన్మరణం చెందాడు. ఎమ్మెల్యే ఆదిమూలం అతడి మృతదేహానికి పూలమాల వేసి అంజలిఘటించారు. ఆయనతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ



నారాయణవనం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 25మంది ఎంపిక



శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగమేళా నిర్వహించారు. ఐదు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 50మంది అభ్యర్థులు పాల్గొనగా 25మంది ఎంపిక య్యారు. వారికి ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు వేతనం, ఇతర అలవెన్సులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, జేకేసీ కో-ఆర్డినేటర్ గంగారామ్, అధ్యాపకులు సతీష్‌కుమార్, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి లీగల్ నోటీసు

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు భూముల వ్యవహారంపై అసెంబ్లీలో ప్రస్తావించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ముగ్గురు రైతులు లీగల్ నోటీసులు జారీ చేశారు. తొట్టంబేడు మండలం కొణతనేరికి చెందిన ముగ్గురు రైతులు ఆ నోటీసులో అభ్యంతరాలను పేర్కొన్నారు.

కట్ట పుట్టాలమ్మ సేవలో మంచు విష్ణు

రేణిగుంట, మార్చి 15, (ఆంధ్రజ్యోతి) : కట్ట పుట్టాలమ్మను సినీ నటుడు మంచు విష్ణు దర్శించుకున్నారు. శనివారం రాజంపేటకు వెళుతూ మార్గమధ్యంలో ఆలయానికి విచ్చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పాడి రాజేంద్ర, కమిటీ సభ్యులు రామ నారాయణ మోహన్ ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు.



శుభ్రతతో మంచి ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం వస్తుందని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి పురవీధుల్లో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, హెచ్‌ఎం రమణయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు సుదాకర్ నాయుడు, ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు

ఇంటి స్థలాల కోసం మోకాళ్లపై నిరసన



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15) ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులు ఇంటి స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా శనివారం మోకాళ్లపై నిలుచుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ దళితులకు ఇంటి పట్టాలు ఇచ్చే వరకు దీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం

శ్రీకాళహస్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని నారద పుష్కరణికి పడమర వైపున ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సిబ్బంది అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది. షాపింగ్‌మాల్‌లోని నాలుగవ అంతస్తులో ఉన్న వంటగదిలో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ప్రమాదం సంభవించింది. సిబ్బంది హుటాహుటినా మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సహా అక్కడికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. ఎలాంటి నష్టం వాటిల్లలేదని ధ్రువీకరించారు.

స్వచ్ఛతపై చైతన్యం ఉండాలి

సత్యవేడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందని ఎంపీపీ ప్రతిమ తెలిపారు. శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచులు, ఎంపీటీసీల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

పల్లికొండేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే, తుడా చైర్‌పర్సన్

నాగలాపురం, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాల యాన్ని శనివారం తుడా వైస్ చైర్‌పర్సన్ మౌర్య, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. ఆలయ సందర్శనకు వచ్చిన వీరికి ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం నంది మండపం వద్ద అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనలు చేసి స్వామి, అమ్మవార్ల మెమెంటోలను అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పార్థిబన్, సెల్వకుమార్, మురళి, మాతయ్య పాల్గొన్నారు.